క్లుప్తంగా

దుర్గమ్మ ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



పూజలు చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: అమ్మలుగన్న అమ్మ దుర్గమ్మ చల్లని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండి, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ప్రార్థించారు. ఈ మేరకు సాలూరు పట్టణంలోని రామాకాలనీలో ఏర్పాటుచేసిన దుర్గమ్మను శుక్రవారం ఆయన దర్శించుకున్నారు. అమ్మవారికి ఈ సందర్భంగా సతీసమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. రాజన్నదొర వెంట పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు



సరస్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న కామాక్షమ్మ తల్లి

సాలూరు: దేవీశరన్నవరాత్రుల్లో భాగంగా తొమ్మిదవ రోజైన శుక్రవారం సాలూరు పట్టణం, మండలంలో అమ్మవారి ఆలయాలు, మంటపాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.పట్టణంలో కామాక్షమ్మ తల్లి సరస్వతి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

బడిదేవరకొండ క్వారీ పనులు ఆపాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడుకృష్ణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి

పార్వతీపురంటౌన్‌: బడిదేవరకొండ క్వారీ పనులు ఆపాలని కొన్నాళ్లుగా గిరిజనులు, ప్రజలు అనేక రూపాల్లో ఆందోళన చేపడుతున్నా క్వారీ యాజమాన్యం కనీసం స్పందించకుండా కొండపై తన వైఖరి చేపడుతోందని, బాధ్యతగల ప్రభుత్వం కూడా పట్టించుకోకపోవడం అన్యాయమని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో గిరిజన సంఘం నాయకుడు పి.రాముతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో గ్రానైట్ యాజమాన్యం తీవ్రమైన ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ప్రజలు, రైతులు, గిరిజనుల గోడు యాజమాన్యానికి ఎలాగూ పట్టదని, కనీసం ప్రభుత్వం కూడా పట్టించుకోకపోవడం అన్యాయమని మండిపడ్డారు. వెంటనే బడిదేవరకొండ గ్రానైట్ తవ్వకాల పనులు ఆపాలని, లీజు లైసెన్సులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

గొంతెండుతోంది..!

- జిల్లాకేంద్రంలో నాలుగు రోజులకు ఒక్కసారి తాగునీరు సరఫరా
- పండగపూటైనా తాగునీరు ఇవ్వాలంటూ పట్టణ ప్రజల విజ్ఞప్తి



పార్వతీపురంటౌన్‌:

మన్యం జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణానికి తాగునీరు సమస్య తీవ్రంగా ఉందని, గతంలో రోజూ సరఫరా అయ్యే తాగునీరు ప్రస్తుతం నాలుగు రోజులకు ఒక్కసారి మాత్రమే పార్వతీపురం మున్సిపాలిటీ యంత్రాంగం సరఫరా చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణ ప్రజలకు తాగునీరు సకాలంలో అందక అవస్థలు పడుతూ ఆందోళన చెందుతున్నారు. పార్వతీపురం పట్టణ సమీపంలో నాగావళి, జంఝావతి నదులు ప్రవహిస్తున్నప్పటికీ అధికారులు, నాయకులకు సరైన అవగాహన లేక తాగునీటి సమస్యపై శాశ్వత పరిష్కారానికి కృషి చేయలేకపోతున్నారని, పట్టణ ప్రజలు, పెద్దలు, మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వాలలో ప్రతిరోజూ సరఫరా అయ్యే తాగునీరు ప్రస్తుతం నాలుగు రోజులకు ఒక్కసారి సరఫరా చేసే పరిస్థితులు ఎందుకు నెలకొన్నాయంటూ పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

సరఫరా ఖర్చుల్లో దొంగ లెక్కలు

మరోవైపు నీటి సరఫరా ఖర్చుల్లో దొంగ లెక్కలు చూపిస్తూ, కొల్లగొడుతున్న సొమ్ము కొందరు అధికారులు, నాయకులు మెక్కేస్తున్నారని? బహిరంగంగానే ప్రజలంతా ఆరోపిస్తున్నారు. తాగునీరు పేదోడికి అందక కన్నీళ్లు పెడుతుంటే దోపిడీ చేసిన సొమ్ముతో పెద్దోళ్లు పాలు తాగి పదవులతో ఊరేగుతూ? ఖుషీ చేస్తున్నారంటూ పట్టణ ప్రజలంతా కోడైకూస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికార యంత్రాంగం ప్రతిరోజూ తాగునీరు సరఫరా చేసేలా చర్యలు చేపట్టకపోతే? నీటి ఉద్యమం తప్పదని వామపక్షాల నాయకులు గతంలో అధికారులను నిలదీసే ప్రయత్నం చేశారు.

గత ప్రభుత్వం హయంలో రూ.63 కోట్ల మంజూరు

గత ప్రభుత్వం హయాంలో తాగునీరు సమస్య శాశ్వత పరిష్కారానికి రూ. 63 కోట్లు మంజూరు చేసినప్పటికీ, కొంతమేరకే పనులు చేసిన అధికారులు ప్రస్తుతం ఎందుకు జాప్యం చేస్తున్నారో? అన్న ప్రశ్నలు కూడా ప్రజల నోటివెంట వినిపిస్తున్నాయి. పార్వతీపురం పట్టణానికి పరిశుభ్రమైన తాగునీటి సమస్య ఎప్పుడు తీరతుందో? ప్రజల ఆరోగ్యం ఎప్పుడు మెరుగుపడనుందో? మున్సిపల్ యంత్రాంగానికే ఎరుక అంటూ..! పట్టణ ప్రజలు మున్సిపల్ పాలక మండలిపై మండిపడుతున్నారు.

సమస్యల పరిష్కారమే ఏపీటీఎఫ్ లక్ష్యం



కామ్రేడ్ నాగభూషణరావు కుటుంబసభ్యులకు జ్ఞాపికలు, సావనీర్‌ను అందచేస్తున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు

- రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.వెంకట నాయుడు

సీతానగరం: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యల పరిష్కారమే ఏపీటీఎఫ్ యూనియన్ ముఖ్య ఉద్దేశ్యమని ఆ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.వెంకటనాయుడు అన్నారు. ఈ మేరకు శుక్రవారం సీతానగరం లోని మండల విద్యావనరుల కేంద్రంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్టోబర్ 6,7,8 తేదీలలో విజయనగరంలోని జె కన్వెన్షన్ హాల్ నందు జరిగిన ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 80 వసంతాల ఓక్ జూబ్లీ వేడుకలకు, 20 విద్యా-వైజ్ఞానిక మహాసభలకు రాష్ట్రం నలుమూలల నుంచి అధిక సంఖ్యలో హాజరైన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పింఛన్ దారులందరికీ ధన్యవాదాలు తెలియ జేశారు.

ఘనంగా ముగింపు సభలు

అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఏపీటీఎఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయ ఫెడరేషన్‌గా 1944 ఏప్రిల్ 16వ తేదీన స్థాపించగా 16 ఏప్రిల్ 2024కి 80 వసంతాల పూర్తయిన సందర్భంగా ఫెడరేషన్ పుట్టిన తాపేశ్వరంలో ప్రారంభ మహాసభలు జరిగాయన్నారు.ఈ నేపథ్యంలో మండల, జిల్లా స్థాయి మహాసభలను ఈ మధ్యకాలంలో నిర్వహించామని తెలిపారు. ఈ సభలకు ముగింపుగా అక్టోబర్ 6,7,8 తేదీల్లో రాష్ట్ర మహాసభలను మన విద్యల నగరం విజయనగరంలో అత్యంత ఘనంగా నిర్వహించామని వివరించారు. ఈ ప్రతినిధుల సభలో నేటి పరిస్థితుల్లో ఉపాధ్యాయ ఉద్యమం లక్ష్యం-తక్షణ కర్తవ్యం-ఎదుర్కొంటున్న సమస్యలు అనే అంశం పైచర్చా పత్రంపై చర్చించి ఆమోదించినట్లు తెలిపారు. ఉద్యోగ,ఉపాధ్యాయ, కార్మిక, పింఛన్ దారులు విద్యార్థులు, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై తీర్మానాలు ఆమోదించినట్లు చెప్పారు. వాటిని ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. విద్యార్థి దశనుంచి ఉపాధ్యాయవృత్తిలో ఉంటూ ఏపీటీఎఫ్‌కు విశేష సేవలందించిన కీర్తిశేషులు కామ్రేడ్ పి నాగభూషణరావు కుటుంబానికి మహాసభల సావనీర్ కాపీలు అందించి సత్కరించామన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పి ధనుంజయ రావు, మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు ఎస్ సత్యం నాయుడు, పి.సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడు ఎం.గౌరీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయాలి



సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

సాలూరు:

టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వేణు డిమాండ్ చేశారు. సీపీఎం శాఖ మహాసభల ప్రారంభం సందర్భంగా శుక్రవారం సాలూరు పట్టణంలోని గాంధీనగర్‌లో ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ పాలనలో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని అది ప్రభుత్వానికి కనిపించడం లేదని విమర్శించారు. నిత్యావసర సరుకులు ధరలను ప్రభుత్వం తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాస్, ఎన్‌వై నాయుడు, శంకరరావు,తదితరులు పాల్గొన్నారు.

రెండు చోట్ల చెరకు తూనిక కాటాలు

సీతానగరం: సంకిలి ఈఐడీప్యారీస్ చక్కెర కర్మాగార యాజమాన్యం సీతానగరం మండలంలో కొత్తగా రెండు చెరకు తూనిక యంత్రాలు(కాటాలు) ఏర్పాటు చేసినట్లు చెరకు అభివృద్ధిశాఖ ప్రాంతీయ మేనేజర్ మురళి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని లక్ష్మీపురం, నిడగల్లు, బూర్జ, ఏగోటివలస గ్రామాల్లో చెరకు తూనిక కాటాలు ఇదివరలో నిర్మాణం చేయడం వల్ల చెరకు తూనిక జరుగుతోందన్నారు. చెరకు సరఫరా చేస్తున్న రైతులకు కాటాలు అందుబాటులో ఉండాలనే సంకల్పంతో ఈఐడీ ప్యారీస్ యాజమాన్యం ఎక్కువగా చెరకు ఉత్పత్తి చేస్తున్న ప్రాంతాలను గుర్తించి చెరకు తూనిక కాటాలను నెలకొల్పుతున్నట్లు తెలియజేశారు.

బొబ్బిలి జోన్ పరిధిలో రైతులను ప్రోత్సహిస్తూ అదనంగా 7 చెరకు తూనిక కాటాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో సీతానగరం మండలంలోని కృష్ణారాయపురం, వెంకటాపురం గ్రామాల్లో చెరకు తూనిక కాటాలు ఏర్పాటు చేశామన్నారు.

రతన టాటా సేవలు మరువలేనివి



రతన టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పెదపెంకి యువత

బలిజిపేట: పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటా సేవలు మరువలేనివని నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు కొనియాడారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని పెదపెంకిలో నేతాజీ గ్రంథాలయం వద్ద గ్రామానికి చెందిన యువత రతన్‌టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంజీవనాయుడు మాట్లాడుతూ ఆయన విలువలతో కూడిన వ్యాపారం చేశారని, ఆయన మృతి దేశానికి, వ్యాపారానికి తీరని లోటని అన్నారు. యువతకు మంచి ఉపాధి అవకాశాలను కల్పించిన గొప్ప వ్యక్తి అని ప్రశంసించారు. వ్యాపారవేత్తే కాకుండా ఆయన గొప్ప మానవతావాది అన్నారు. కార్యక్రమంలో కె.బాబూరావు, డి.రామారావు, జి.శ్రావణ్, కె.గౌరీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

మహిషాసుర మర్దినిగా దుర్గమ్మ



మహిషాసుర మర్దిని అవతారంలో పూజలు అందుకుంటున్న అమ్మవారు

బలిజిపేట: దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా బలిజిపేట మండలంలోని అజ్జాడ గ్రామంలో గల శ్రీ విజయదుర్గా భవానీ ఆలయంలో అమ్మవారిని శుక్రవారం మహిషాసుర మర్దిని అవతారంలో అలంకరించారు. ఆలయంలో అర్చకులు బి.రామలింగస్వామి, ప్రసాద్‌శర్మల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.



సీతానగరం: బుద్దిపేటలో మహిషాసురమర్దిని అలంకరణలో దర్శనమిచ్చిన దుర్గాదేవి



సీతానగరం: బుద్దిపేటలో మహిషాసురమర్దిని అలంకరణలో దర్శనమిచ్చిన దుర్గాదేవి

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర

పార్వతీపురంటౌన్‌:

మహిళలు అన్ని రంగాల్లో రాణించి మార్గదర్శకులుగా నిలవాలని ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ పిలుపునిచ్చారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం స్థానిక గిరిమిత్ర సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీ వాస్తవ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల జీవితంలో కౌమారదశ చాలా కీలకమన్నారు. అధునాతన సాంకేతికతకు తగ్గట్టుగా బాలికలు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే చాలా మంది మహిళలు దేశానికి వెన్నెముకగా నిలిచారని, రాబోయే తరం కూడా అదే స్థాయిలో నిలవాలని ఆకాంక్షించారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీ వాస్తవ మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి పిలుపు మేరకు ప్రతి ఏడాది అక్టోబరు 11న అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి ఎం ఎన్.రాణి మాట్లాడుతూ భవిష్యత్తు కోసం అమ్మాయిల దృష్టి ఈ ఏడాది నినాదమని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జగన్‌మోహన్, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఎ.సత్యనారాయణ, పార్వతీపురం సీడీపీఓ బి.శ్రీనివాసరావు, అప్‌హోల్డ్ ఎన్‌జీఓ కోఆర్డినేటర్ రాజశేఖర్, ప్రజాప్రతినిధులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఘాటెక్కిన ఉల్లి

- మూడింతలు పెరిగిన ధర



పార్వతీపురం: ఉల్లిపాయ లేకుండా ఏ కూరా రుచిగా ఉండదు. అవి లేకుండా కూరలు వండాలంటే ఎవరూ ఇష్టపడరు. గడిచిన మూడు నెలల క్రితం కిలో రూ.25 పలికిన ధర నేడు మూడింతలు పెరిగింది. కొత్త ఉల్లిపాయలు కిలో రూ.60, పాత ఉల్లిపాయలు రూ.70కి విక్రయిస్తున్నారు. వరుసగా పండగలు, శుభకార్యాలు ఉండడంతో ధరలు మరింతగా పెరుగుతున్నాయి. గతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా ఉల్లిసాగు తగ్గి దిగుబడి పడిపోయింది. వ్యాపారస్తులు నాణ్యతను బట్టి ధరలు నిర్ణయిస్తున్నారు. ఉల్లిగడ్డలు అధికంగా పండించే కర్నూలులో పంట ఆలస్యం కావడంతో పాటు వర్షాలు అధికంగా కురవడంతో పంట చేతికి రాక ఉల్లిపాయల లభ్యత తగ్గిపోయింది. ఇతర ప్రాంతాల నుంచి ఉల్లిని దిగుమతి చేసుకోవడం వల్ల రవాణా ఖర్చులు కూడా తడిసి మోపుడవుతున్నాయి. ఇదంతా చివరకు వినియోగదారులపై పడుతోంది. ఉల్లి, వెల్లుల్లి కొనాలంటే సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. ఏడాది క్రితం కిలో రూ.100 లోపు ఉన్న వెల్లుల్లి ధర ప్రస్తుతం రిటైల్ మార్కెట్‌లో రూ. 350కి చేరింది. మసాలా వంటకాల్లో ప్రధాన అవసరమైన వెల్లుల్లి ధరలు ఇలా పెరిగిపోవడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతు బజారుల్లో అరకొరగానైనా సబ్సిడీపై ఉల్లిపాయలను విక్రయిస్తున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో విక్రయించకపోవడంతో వినియోగదారులకు తిప్పలు తప్పడం లేదు.

తిరువీధికి సహకరించాలి

- డీఎస్పీ రాంబాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రాంబాబు

పాలకొండ: కోటదుర్గమ్మ నవరాత్రి ఉత్సవాలు ముగిసిన నేపథ్యంలో శనివారం జరగనున్న తిరువీధి ఉత్సవం విజయవంతం చేయడానికి ప్రజలు సహకరించాలని డీఎస్పీ ఎం. రాంబాబు కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అమ్మవారి తిరువీధి సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమవుతుందన్నారు. తిరువీధి సమయంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని స్పష్టం చేశారు. ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలు నిలిపివేశామని తెలిపారు. సుమారు 250 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయనతో పాటు సీఐ చంద్రమౌళి, ఎస్సై ప్రయోగమూర్తి ఉన్నారు.

లింగ సమానత్వం కీలకం..

భామిని: దేశ పురోభివృద్ధిలో లింగ సమానత్వం కీలకమని హోలీక్రాస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కరణం ప్రభుదాస్ అన్నారు. శుక్రవారం స్థానిక జీవనోపాధుల అభివృద్ధి కేంద్రంలో 'బాలికల చైతన్యం – లింగ సమానత్వం సాధన'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల బాలికలు చదువుకు దూరమైపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే భ్రూణహత్యల వల్ల సమాజంలో అసమానతలు పెరిగిపోతున్నాయన్నారు. బాలికలకు గౌరవప్రదమైన జీవితం అందించేలా సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో బాలికలు, మెంటార్లు, తదితరులు పాల్గొన్నారు.